
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9, కనిష్ఠం 21.1

నిజామాబాద్ జిల్లా వార్తలు

5 మంగళవారం 6 ఫిబ్రవరి 2024





తగ్గుతున్న చెరుకు

- జిల్లాలో ఫ్యాక్టరీల మూతతో తగ్గుతున్న పంట సాగు విస్తీర్ణం
- చెరుకు నుంచి వచ్చే ఇథనాల్‌కు భారీగా పెరిగిన డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలపై క్యాబినెట్ సబ్ కమిటీ
- ఫ్యాక్టరీలు తెరిపించి ఉపాధి కల్పించాలని కార్మికుల వేడుకోలు

నిజామాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా చెరుకు పంటకు డిమాండ్ పెరుగుతున్నా జిల్లాలో మాత్రం ఆదరణ తగ్గుతోంది. నైజాం కాలం నుంచి వేల ఎకరాల్లో సాగైన పంట ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న రెండు ఫ్యాక్టరీలు మూత పడడంతో సాగు తగ్గిపోయింది. చెరుకు నుంచి వచ్చే ఇథనాల్, చక్కెర, బెల్లానికి డిమాండ్ పెరుగుతున్నా ఫ్యాక్టరీలు లేకపోవడం వల్ల రైతులు సాగుకు మొగ్గుచూపడం లేదు. ప్రస్తుతం చెరుకు సాగుచేసే రైతులకు లాభాలు ఉంటున్నా దూర ప్రాంతాలకు తీసుకువెళ్లే పరిస్థితి లేక రైతులు ఇతర పంటలు వేస్తున్నారు. నిజాం చక్కెర కర్మాగారంతో పాటు సారంగపూర్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే మళ్లీ చెరుకు సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలపై క్యాబినెట్ సబ్ కమిటీని వేయడంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. చక్కెర కర్మాగారంలో పనిచేసే కార్మికులు కూడా ఫ్యాక్టరీ తెరిస్తే తమకు కలిసివస్తుందని ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు.

నైజాం కాలంలో కర్మాగారం

నైజాం కాలంలో జిల్లాలోని బోధన్‌లో చక్కెర కర్మాగారం మొదలైంది. నైజాం ప్రభుత్వం ఆసియాలోనే అతి పెద్ద చక్కెర కర్మాగారాన్ని బోధన్‌లో ఏర్పాటు చేసింది. బోధన్‌తో పాటు మెట్‌పల్లిలోని ముత్యంపేట, మెదక్‌లో కూడా ఈ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసింది. ఈ ఫ్యాక్టరీల కోసం వేల ఎకరాల భూములను కూడా ఇచ్చింది. బోధన్ చక్కెర కర్మాగారం పరిధిలో వేలాది ఎకరాల్లో చెరుకు సాగైంది. బోధన్, కోటగిరి, వర్ని, ఎడపల్లి, నవీపేట, రెంజల్, నిజామాబాద్ రూరల్‌తో పాటు ఇతర మండలాల్లో చెరుకుసాగు ఎక్కువగా చేశారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 40వేల ఎకరాల వరకు చెరుకు సాగయ్యేది. చెరుకు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుండడంతో సారంగపూర్‌లో కూడా కో ఆపరేటివ్ చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో రైతులు చాలా ఏళ్లు చెరుకు సాగు చేశారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో నిజాంషుగర్ ఫ్యాక్టరీలను అప్పటి ప్రభుత్వం కొంత ప్రైవేట్‌కు విక్రయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో నడిపించారు. కొన్నేళ్లు నడిచిన తర్వాత బోధన్‌లోని చక్కెర కర్మాగారాన్ని డిసెంబర్ 22, 2015లో ఫ్యాక్టరీ యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్యాక్టరీని తెరిపించలేదు. కొంతమంది కార్మికులు వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోగా మరికొంత మంది కార్మికులు ఇప్పటికీ వేచి చూస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ మూతపడడంతో దీనిపై ఆధారపడ్డ రైతులు చెరుకు సాగును తగ్గించారు. ప్రతి యేడు కొంత ఇబ్బంది ఏర్పడడం, సదాశివనగర్, నిజాంసాగర్‌లోని ప్రైవేట్ ఫ్యాక్టరీలకు తీసుకువెళ్లేందుకు అనుకూలంగా లేకపోవడంతో వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఇప్పటికీ సాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలో 4వేల ఎకరాల వరకు చెరుకు సాగు కొనసాగుతోంది. ఈసాగు చేసే రైతులు ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు ప్రైవేట్ ఫ్యాక్టరీలతో పాటు మహారాష్ట్రలోని ఫ్యాక్టరీలకు తీసుకువెళ్లి అమ్మకాలను చేస్తున్నారు.

కొన్నేళ్లుగా చెరుకు రైతులకు లాభాలు

చెరుకు రైతులకు గడిచిన కొన్నేళ్లుగా లాభాలు పెరుగుతున్నాయి. జాతీయస్థాయిలో పెట్రోల్ వినియోగం భారీగా పెరిగింది. ఈ పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలుపుతున్నారు. ఈ ఇథనాల్‌కు భారీ డిమాండ్ పెరిగింది. గతంలో చక్కెర ఫ్యాక్టరీల నుంచి చక్కెర, బెల్లం, మొలాసిస్‌ను తయారు చేసేవారు. చక్కెర అమ్మకాలు లేకుంటే ఫ్యాక్టరీకి ఇబ్బందులు వచ్చేవి. ప్రస్తుతం మొలాసిస్ నుంచి ఇథనాల్‌ను తీస్తున్నారు. ఇథనాల్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. పెట్రోల్ ఉత్పత్తుల్లో ఈ ఇథనాల్‌ను కలుపు తుండడం వల్ల చెరుకు పండించే రైతులకు భారీగా ధరలు వస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఫ్యాక్టరీల్లో టన్నుకు 3400 రూపాయల వరకు ధర పెడుతున్నారు. ఎకరం సాగుచేసే రైతుకు సాలీన లక్షన్నర వరకు ఆదాయం వస్తుంది. ఒకసారి వేస్తే రెండు, మూడు సార్లకు అవకాశం ఉండడం వల్ల రైతులకు లాభాలు వస్తున్నాయి. చక్కెర ఫ్యాక్టరీలు కూడా లాభాల్లో కొనసాగు తున్నాయి. ఇథనాల్‌తో పాటు చక్కెర నుంచి వచ్చే వేస్టేజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల పరిశ్రమలకు మరింత లాభాలు వస్తున్నాయి. చెరుకు సాగుకోసం నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని జిల్లా రైతులు కోరుతున్నారు. ఇదే రీతిలో 2008లో మూతపడిన సారంగపూర్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని కూడా తెరిపించాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి ఆధ్వర్యంలో సబ్ కమిటీ..

రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావును సభ్యులుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలను పరిశీలించి నివేదిక ఇస్తే దానికి అనుకూలంగా మూడు ఫ్యాక్టరీలను తెరిపించే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఈ మూడు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తా మని కాంగ్రెస్ నేతలు హామీ ఇవ్వడం వల్ల కమిటీ ఏర్పాటు వల్ల ఆశలు పెరుగుతున్నాయి. లాభాల తో నడిచే నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిం చాలని కార్మికులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో పరిస్థితి భిన్నం

విపరీతంగా చెరుకును సాగు చేస్తున్న రైతులు

జిల్లా పరిధిలో రెండు ప్రయివేటు ఫ్యాక్టరీలు

చెరుకు సాగులో నిజామాబాద్ జిల్లాతో పోలిస్తే కామారెడ్డి జిల్లాలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఈ ప్రాంతంలో రైతులు చెరుకును విపరీతంగా సాగు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా పరిధిలో రెండు ఫ్యాక్టరీలు మూతపడడం వల్ల ఈ జిల్లాలో సాగు తగ్గింది. కానీ కామారెడ్డి జిల్లా పరిధిలో రెండు ప్రయివేటు ఫ్యాక్టరీలు ఉండడం వల్ల అక్కడ చెరుకు సాగుకు డిమాండ్ ఏర్పడింది. సాగు చేసే చెరుకు రైతులకు అత్యధిక ధర కూడా వస్తోంది. టన్నుకు 3,400 రూపాయల వరకు ధర పలుకుతోంది. రైతుకు ప్రతీ సంవత్సరం ఎకరాకు లక్షన్నర రూపాయల వరకు ఆదాయం వస్తోంది. చెరకు ఫ్యాక్టరీలో ఇథనాల్ ఉత్పత్తి వల్ల ఫ్యాక్టరీలకు లాభాలు పెరిగాయి. మార్కెట్‌లో ఇథనాల్‌కు డిమాండ్ ఉండడం.. పెట్రోల్‌లో వాడకం వల్ల చెరుకు ఫ్యాక్టరీలకు ఎక్కువగా వాటితోనే లాభాలు వస్తున్నాయి. ప్రయివేటు ఫ్యాక్టరీల యజమానులు కామారెడ్డి జిల్లా పరిధిలో రైతులతో ఒప్పందాలు చేసుకుంటూ చెరుకు సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నాయి. కానీ నిజామాబాద్ పరిధిలో ఫ్యాక్టరీలు మూతపడడం వల్ల రైతులు చెరుకు సాగును బాగా తగ్గించేశారు.



ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి...

: రవిశంకర్ గౌడ్, కార్మిక సంఘం నేత

బోధన్ ఫ్యాక్టరీలో అన్నిరకాల వసతులు ఉన్నాయి. లే ఆఫ్ ప్రకటించి ఎనిమిదేళ్లు అవుతుంది. లాభాలతో నడిచే ఫ్యాక్టరీని మూసివేశారు. ప్రస్తుతం చక్కెర కర్మాగారాలన్ని లాభాలతో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పరిశీలించి వెంటనే ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి.



అధిక సాగు ఉన్నా మూసివేశారు...

: సత్యనారాయణ, కార్మికుడు

బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి కావాల్సినంత చెరుకు ఉండేది. రైతులు పెద్దఎత్తున సాగు చేశారు. పరిశ్రమకు అవసరమైనంత చెరుకు వస్తున్నా మేనేజ్‌మెంట్ లే ఆఫ్ ప్రకటించింది. క్యాబినెట్ సబ్ కమిటీ వేసిన ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకొని తిరిగి నడిపించాలి.





జిల్లాలో పసుపునకు భారీ డిమాండ్

- నగరంలోని మార్కెట్‌లో క్వింటా రూ.13వేల 323 పలికిన ధర
- ఈ ఏడాది తగ్గిన పసుపు సాగు విస్తీర్ణం



ఖిల్లా, ఫిబ్రవరి 5: ఈ ఏడాది పసుపునకు భారీగా డిమాండ్ పెరిగింది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొస్తున్న కొత్త పసుపునకు కొన్ని రోజులుగా ధర వస్తుంది. మార్కెట్‌కు సోమవారం పసుపు తీసుకరాగ అత్యధికంగా క్వింటా రూ.13వేల320లు ధర పలికింది. ఏర్గట్లకు చెందిన ధన్నే సంతోష్ అనే రైతు 15క్వింటాళ్ల కొత్త రకం 2356 పసుపును తీసుకరాగ ఈ ధర వచ్చింది. మార్కెట్‌లో సరాసరి మోడల్ ధర క్వింటాలుకు రూ.10వేల 630లు ధర పలికింది. పసుపు గోల రకానికి మార్కెట్‌లో క్వింటాలు 11వేల 772రూపాయల అత్యధిక ధర వచ్చింది. నిజామాబాద్ మార్కెట్‌కు గడిచిన నెల రోజులుగా కొత్త పసుపు వస్తోంది. జనవరి నెలలో కొద్ది మొత్తంలో రాగ ఆ నెల చివరి నుంచి ప్రతి రోజూ 15వేల క్వింటాళ్ల నుంచి 2వేల క్వింటాళ్ల వరకు వస్తుంది. మార్కెట్‌కు వచ్చే కాడి, గోళ రకాలకు ఈ ధర పలుకుతోంది. మార్కెట్‌లోకి వచ్చే పాత పసుపునకు కూడా ధర ఎక్కువగానే వస్తుంది. కాడి రకానికి సరాసరి క్వింటాలుకు 11వేలు వస్తుండగా అత్యధికంగా 12వేల వరకు క్వింటాళుకు కొనుగోలు చేస్తున్నారు. గోళ రకం పాత పసుపునకు కూడా 11వేల నుంచి11600ల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది పసుపు సాగు విస్తీర్ణం దిగుబడి కూడా తగ్గడం డిమాండ్ అత్యధికంగా ఉండడం వల్ల ఈ ధర వస్తుంది. వ్యాపారులు కొంత మంది గ్రామాలకు వెళ్లి కూడా రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో స్ర్కీనింగ్ టెన్షన్!



- నేడు కాంగ్రెస్ స్ర్కీనింగ్ కమిటీ సమావేశం
- పార్లమెంట్ అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన
- జిల్లా నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేతలు

నిజామాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల స్ర్కీనింగ్ మంగళవారం కాంగ్రెస్ నేతలు చేపట్టనుండగా పోటీకి సిద్ధమైన నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హైదరాబాద్‌లో ఉండి నేతలను కలుస్తున్నారు. స్ర్కీనింగ్ కమిటీ సమావేశంలో అభ్యర్థులను వారి బలాబలాలను బట్టి జాబితాను సిద్ధంచేయనుండడంతో ముందస్తుగా సీఎంతో పాటు ఇతర నేతలను కలుస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ స్ర్కీనింగ్ కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న దరఖాస్తులను పరిశీలించనున్నారు. ప్రతి పార్లమెంట్ పరిధిలో ముగ్గురు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయనున్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే ఫలితాల ఆధారంగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ బలాలను అంచనా వేసి బలమైన నేతలకు అవకాశం ఇవ్వనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పోటీ కోసం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, మాజీ విప్ ఈరవత్రి అనిల్, కాటిపెల్లి వికాస్ రెడ్డి, నరాల కళ్యాణ్‌లు దరఖాస్తు చేశారు. వీరితోపాటు మరి కొంత మంది దరఖాస్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి క్యాబినెట్‌లో బెర్త్ కోసం గట్టి ప్రయత్నాలు చేశారు. అధిష్ఠానం ఎంపీగా పోటీచేయాలని కోరడంతో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. పార్టీలో సీనియర్ కావడం, మూడు దఫాలు ఎమ్మెల్యేగా, రెండు దఫాలు మంత్రిగా ఆయన పనిచేశారు. దీంతో ఆయనను పోటీ చేపిస్తే కలిసివస్తుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల్లో పేరున్న నేత కావడంతో ఆయన పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లా నుంచి ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత దరఖాస్తు చేశారు. వీరిద్దరు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత జీవన్ రెడ్డికి కాకుంటే తమకు ఇవ్వాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పనిచేసిన అరికెల నర్సారెడ్డి తనకు ఇస్తే అన్నివర్గాలు సహకరిస్తాయని సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ఇన్‌చార్జిలకు వివరించినట్లు తెలుస్తోంది. మహిళా నేతగా ఉండడంతో పాటు గతంలో ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేసి ఉండడం వల్ల తనకు అవకాశం ఇవ్వాలని ఆకుల లలిత కోరుతున్నారు. బాల్కొండ టికెట్‌ను వదులుకున్న ఈరవత్రి అనిల్ కూడా ఎంపీగా పోటీకి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. సినీ నిర్మాత దిల్‌రాజుతో పాటు బాల్కొండ నుంచి పోటీ చేసిన సునీల్ రెడ్డి అభ్య ర్థిత్వాలను కూడా అధిష్ఠానం పరిశీలించినట్లు సమాచారం. ఎక్కువ మంది దరఖాస్తులు చేసిన త్రిముఖ పోటీ ఉండే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బలమైన అభ్యర్థినే బరిలోకి దించనున్నట్లు సమాచారం.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- రూ.4వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 5 : ఇంటి అనుమతి రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు యజమాని వద్ద రూ.4వేల లంచం తీసుకుంటున్న గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన సోమవారం జిల్లాలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల నిఖిల్ అనే వ్యక్తి జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామంలో మూడు నెలల క్రితం ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. ఆ ఇంటిని తమ పేరిట ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుమతి ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి తోపారం మనోహర్‌ను సంప్రదించాడు. ఇందుకు రూ.15వేలు లంచం ఇవ్వాలని కార్యదర్శి డిమాండ్ చేయగా.. చివరకు రూ. 4వేలు ఇచ్చేలా ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని నిఖిల్ ఇటీవల ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు పథకంలో భాగంగా సోమవారం తొర్లికొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మనోహర్‌కు నిఖిల్ రూ.4వేల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మనోహర్‌ను అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.



అధికారులు పట్టుకున్న రూ.4వేల నగదు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

ఈవీఎం గోదాం పరిశీలన

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 5: జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ఈవీఎం గోదాం సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన జరిపేందుకు ఈసీ ఐఎల్‌కు చెందిన 17మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుంది. ఈ బృందం దాదాపు 10 రోజుల పాటు ఇక్కడే ఉండి ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం గోదామును తెరిపించారు. స్థానికంగా గల 2916 బ్యాలెట్ యూనిట్లు, 1752 కంట్రోల్ యూనిట్లు, 2373 వీవీప్యాట్‌లను పరిశీలన బృందం పరిశీలిస్తుందని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగేల చూడాలని పూర్తి పారదర్శకంగా నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రమిత్ర, యాదిరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజగౌడ్, వినోద్‌కుమార్, భుజంగరావ్, అధికారులు, పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



ఈవీఎం గోదాము సీల్ తీస్తున్న అధికారులు





శివాలయంలో పూజలు చేస్తున్న ఆర్మూర్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఫిబ్రవరి 5: పట్టణంలోని సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, స్థానిక కౌన్సిలర్‌లు శివాలయంలో ఆస్థాన పురోహితుడు కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భజనలు చేశారు. ఈ సందర్భంగా పొద్దుటూరి వినయ్‌రెడ్డి-అనన్య దంపతులు, చిలుక హరిత రాజుబాయి, గీత శ్రీనివాస్‌రెడ్డి, రజిత గంగారెడ్డి దంపతులు అన్నప్రసాద దాతగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు బి.సుమన్, వీసీ.గంగారెడ్డి, గంగాకిషన్, బోండ్ల ఆనంద్, అయ్యప్ప శ్రీనివాస్, న్యాయవాది విప్లవ్‌కుమార్, ఆలయ కమిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పించిన చైర్‌పర్సన్**

పెర్కిట్: అవిశ్వాస విగిపోయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాదం రాజ్‌కుమార్, మురళీధర్, మీనచందు, సుంకరి సుజాత, కొంతం మురళీ, నాయకులు పండిత్ పవన్, ఎస్ఆర్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 5: ఆర్మూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారులుగా నియామితులైన వారికి గ్రామపంచాయతీ పరిపాలన వీధులపై డీఎల్‌పీవో వీవీ.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ముఖ్యవిధులు అయిన పారిశుధ్యం, నీటి సరఫరా, వీదిదీపాలు, పన్నుల వసూలు, మొక్కల పెంపకంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలకు అనుమతులు, లేఅవుట్ అనుమతులు ఇచ్చే విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర గ్రాంట్‌లను ఏలా వినియోగించాలన్న అంశంపై ఆయన వివరించారు. జీపీ అభివృద్ధి ప్రణాళిక, ఈజీఎస్, హరిత హారం, తదితర అంశాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్, బాల్కొండ ఎంపీడీవోలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ శివచరణ్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వీఆర్‌ఏల వినతి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: వారసత్వ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఈవిషయమై ప్రత్యేకశ్రద్ధ చూపి జీవో అమలు చేయించాలని మండలంలోనివీఆర్ఏలు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వారి పిల్లలకు విద్యార్హతలను బట్టి వారసత్వ ఉద్యోగాలు ఇపిప్పంచాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయమై పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని కలిసిన వారిలో విఆర్ఏల వారసులు సజ్జు, శంకర్, శ్రీనివాస్, మూర్తి, తదితరులు ఉన్నారు.

ఉప్లూర్ చెరువులో పడి ఒకరి మృతి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన మల్లవ్వ (50) అనే మహిళ చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత కొంత కాలంగా మానసిక, ఆరోగ్యస్థితి బాగలేకపోగా, ఒంటరితన్నాన్ని భరించలేక మనస్థాపానికి గురైన మల్లవ్వ ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని నల్ల చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి కూతురు సోని పిర్యాదు మేరకు సోమవారం మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బాధితుడికి రూ.లక్ష ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత


ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమాగౌడ్ గత మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గాయాలు ఇంకా తగ్గకపోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాగౌడ్ కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లక్ష రూపాయల ఎల్‌వోసీ మంజూరు చేసి చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

● **అపస్మారకస్థితిలో ఉన్న బాలికకు వైద్యం**

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన చిన్నారి ఆసియా బేగం (గౌస్ కుమార్తె) మెదడులో గడ్డ ఏర్పడి ప్రాణపాయ స్థితిలో ఉండటంతో ఇట్టి విషయం ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు మదన్ మోహన్ వెంటనే స్పందించి నిమ్స్ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. చిన్నారి ఆసియా బేగానికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరిగిందని పేర్కొన్నారు. సకాలంలో ఆపరేషన్ నిర్వహించినందున ఆసియాబేగం ప్రాణపాయస్థితి నుంచి బయటకు పడింది. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చేసిన సహాయాన్ని మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.













రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సుద్దపల్లి గురుకుల విద్యార్థులు ప్రతిభ

డిచ్‌పల్లి,ఫిబ్రవరి5: మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీల్లో సుద్దపల్లి గురుకుల విద్యార్థులు బంగారు పతకం చాటి ప్రతిభ చాటారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో క్రీడకారులు మంచి ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ గోదావరి ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన రాణి, వైశాలి, ప్రణీత, సాత్విక, సావిక,నేహ, శ్రీబిందు, నేహ, గంగోత్రి, లను ప్రిన్సిపాల్ అభినందించారు.

భీమ్‌గల్‌లో అన్యాక్రాంతమైన చెరువు శిఖం భూములు

- కబ్జాకు గురైన రాధం చెరువు, మొగిలి చెరువు, ధర్మారాయుడుకుంట, బాబాపూర్‌కుంట, బైడిచెరువు
- అధికారుల సర్వేతో ఉలిక్కిపడుతున్న భూ కబ్జాదారులు
- రాధం చెరువు సర్వే నెంబర్‌లో వెలిసిన ఇళ్లు, వెంచర్లు


భీమ్‌గల్‌లో చెరువుల భూములను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వినోద్‌కుమార్

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 5: భీమ్‌గల్ పట్టణంలో గత కొన్ని రోజులుగా రెవెన్యూ జిల్లాస్థాయి అధికారులు చెరువుల సర్వేను నిర్వహిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు ఎన్నోమార్లు సర్వేనిర్వహించి మమ అనిపించారు. చెరువు శిఖం భూములు కబ్జాకు గురై అక్రమంగా అడ్డగోలు సర్వేనెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసి ఇళ్లను నిర్మించి లక్షలు, కోట్లల్లో రియలేస్టేట్ వ్యాపారులు దర్జాగా సొమ్ము చేసుకున్నారు. ఈ తంతగం అంతా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో చెరువు భూములు ఆక్రమణలకు గురై దర్జాగా వెంచర్లుగా ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు దర్జాగా చెరువు భూములను కబ్జా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. భీమ్‌గల్ మున్సిపాలిటీ లోని రాధం చెరువు పట్టణీకరణ నేపధ్యంలో చెరువు శివారు భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు ప్రజాప్రతినిధులు రాధం చెరువు భూములను కబ్జాలు చేసి గజం విలువకు అమ్మేశారు.

● ఈ సర్వేనైనా పకడ్బందీగా జరిగేనా

ప్రస్తుతం భీమ్‌గల్ మండలంలో చెరువుల సర్వేను అధికారులు గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వేనైనా అధికారులు పకడ్బందీగా నిర్వహించి కబ్జాకు గురైన చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంటారా, ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్లకు లొంగిపోతారా అన్న సందేహాలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. భీమ్‌గల్ మున్సిపాలిటీ పట్టణ సుందరీకరణలో భాగంగా రాధం చెరువును గత ప్రభుత్వ హయంలో రాధం చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేశారు. దీంతో ఒక్కసారిగా రియలర్‌టర్ లు రాధం చెరువు సర్వేనెంబరు 27 లోని చెరువు శిఖం భూములను దర్జాగా కబ్జాచేసి సుమారు 20 ఎకరాల చెరువు భూమిని వెంచర్ లుగా మార్చి తప్పుడు సర్వే నెంబర్లతో రిజిష్ట్రేషన్ లు చేసి క్రయ విక్రయాలు జరిపారు. వీరికి వత్తాసుగా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సహాయ సహకారాలు అందించి లక్షలు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలు

భీమ్‌గల్ మండలంలోని చెరువులు కుంటలు కబ్జాకు గురిఅయ్యాయి. రాధం చెరువు సర్వేనెంబరు27 లో 73 ఎకరాలు, మొగిలిచెరువు సర్వేనెంబరు544 విస్తీర్ణం 41 ఎకరాలు, బైడి చెరువు సర్వే నెంబరు277 విస్తీర్ణం 43 ఎకరాలు, ధర్మారాయుడు కుంట సర్వేనెంబరు426 విస్తీర్ణం 5.38 గుంటలు, బాబాపూర్ కుంట సర్వేనెంబరు50 విస్తీర్ణం 7.29 ఎకరాలు గా వుంది. ప్రస్తుతం చెరువులు, కుంటలు పెద్ద మొత్తంలో కబ్జాకు గురి అయ్యాయి. భీమ్‌గల్ శివారులోని ధర్మారాయుడు కుంట పూర్తిస్థాయిలో కబ్జాకు గురైంది. కుంట భూమిలో ప్లాట్లు వెలిశాయి. ఇప్పటికైనా అధికారులు తూతూ మంత్రంగా సర్వేనిర్వహించకుండా అన్యాక్రాంతమైన చెరువులు, కుంటల భూములు వెలికితీయాలని, రాధం చెరువు సర్వేనెంబర్‌లో అక్రమంగా నిర్మించిన వెంచర్లను, ఇళ్లను ప్రభుత్వం తమ ఆదీనంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువుల సర్వే కొనసాగుతుంది



పై అధికారులు ఆదేశాల ప్రకారం భీమ్‌గల్ పట్టణంలోని రాధం చెరువు, చుట్టు ప్రక్కల చెరువులు, కుంటల సర్వే కొనసాగుతుంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సర్వే చేస్తున్నాము. సర్వేనెంబరు 27 రాధం చెరువు భూమిలో అక్రమంగా గృహనిర్మాణాలు చేపట్టారని తెలుసుకున్నాం. పై అధికారులకు పూర్తిస్థాయిలో నివేదికలను పంపిస్తాము. అధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

- వెంకటరమణ. తహసీల్దార్ భీమ్‌గల్

టీయూలో విద్యార్థుల ఆందోళన

● మెస్ చార్జీల అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ ● రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన విద్యార్థులు


టీయూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5: తెలంగాణ యూనివర్సిటీలోని హస్టల్‌లో అవినీతి మెస్ బిల్లుల పేరిట విద్యార్థులపై అదనపు భారం మోపుతున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ హస్టల్ విద్యార్థులు సోమవారం రిజి స్ట్రార్ చాంబర్ లో ఆందోళన చేశారు. అధిక మెస్‌బిల్లు లలకు వేస్తున్న అధికారులకు నిరసనగా విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. కొవిడ్‌తర్వాత పెరిగిన ధరలకు అనుగు ణంగా మెస్ చార్జీల అపోహతో విద్యార్థులపై అధిక భారం మోపుతూ అవినీతి బట్టబయలు అయిందని విద్యార్థులు అన్నారు. అవినీతి జరిగిన మెస్ బిల్లులను తక్షణమే మాఫీ చేసి విద్యార్థులపై భారం పడకుండా అధికార యంత్రంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 5సంవత్సరాల హస్టల్ బిల్లులు పరిశీలించి ఎక్కడ అవినీతి తప్పులు జరిగాయో విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేస్తామని రిజిస్ట్రార్ యాదగిరి తెలిపినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఇసుకను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

సిరికొండ,ఫిబ్రవరి 5: సిరికొండ మండల పరిధిలో ఏవైరన అక్రమ ఇసుక, మొరం తవ్వకాలు చేపట్టిన, అక్రమ వ్యాపారం చేసిన చట్టపర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండలో ఇసుక అక్రమ రవాణా అనే వార్త ఆంధ్రజ్యోతిలో సోమవారంప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. ఏవైరన గృహఅవసరాల కోరకు ఇసుక తీసుకోవాలంటే రూ.900డ్రాఫ్టురూపంలో బ్యాంకులో ది డిస్టిక్ కలెక్టర్ నిజామాబాద్ పేరుతో డీడీ చెల్లిం చాలని సూచించారు. డీడీ లు చెల్లించిన వారికి బుధవారం, శుక్రవారం ఇసుక రావా ణాకు అనుమతి ఇస్తామని తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు.

పెన్షన్ల పంపిణీలో చేతివాతంపై విచారణ

బీర్కూర్, ఫిబ్రవరి 5 : పెన్షన్ల పంపిణీలో తపాల శాఖ సిబ్బంది డబ్బులు నొక్కేస్తున్నారని బీర్కూర్‌కు చెందిన పలువురు లబ్దిదారులు తపాల శాఖ ఉన్నతాధికారులకు ఇటీవల సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తపాల శాఖ బోధన్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు సోమవారం బీర్కూర్‌కు విచ్చేసి విచారణ చేపట్టారు. బీర్కూర్‌లో సుమారు వెయ్యికి పైగా పెన్షన్ లబ్దిదారులు ఉన్నారు. వికలాంగులకు రూ.4016, మిగిలిన లబ్దిదారులకు రూ.2016ల చొప్పున ప్రభుత్వం ఆసరా పెన్షన్లు అందిస్తుంది. అయితే తపాలా సిబ్బంది 4016 రూపాయలకు 4 వేలు, 2016 రూపాయలకు 2 వేలు మాత్రమే అందజేసిపైన 16 రూపా యలు నొక్కేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతినెల ఒక్కో లబ్దిదారుడి నుంచి 16 రూపాయల చొప్పున వెయ్యి మంది నుంచి 16 వేల రూపాయలు దోచుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తపాలా శాఖ అధికారి లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. మీకు గత నెల ఎన్ని డబ్బులు అందించారని విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పకడ్బందీగా వ్యవహరిద్దాం

- సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం
- నాందేడ్‌లో రాష్ట్ర సరిహద్దు పోలీసు ఉన్నతాధికారుల సంయుక్త సమావేశం
- పాల్గొన్న నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి నాందేడ్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు


సమావేశంలో పాల్గొన్న రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు

భైంసా, ఫిబ్రవరి 5 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా వ్యవహరించాలని సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మహారాష్ట్ర - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో నాందేడ్ రేంజ్ డీఐజీ శశికాంత్ మహావార్కర్, నాందేడ్ ఎస్పీ కృష్ణ కొకటేల తో పాటు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగినవార్, కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మలు సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, బందోబస్తు విధానాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు ప్రణాళిక బద్ధమైన విధానాలతో ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం సమన్వయం, సమష్టి కృషితో ప్రశాంత వాతవరణంలో పూర్తయే దిశగా వ్యవహరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం పంచుకుంటూ ఎలాంటి లోపాలకు అస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికలకు పకడ్బందీగా నిర్వహించేందుకు సరిహద్దు మార్గంలో.. సమాచారం వ్యూహం అమలు చేయడానికి రెండు రాష్ట్రాల పోలీసులు సంసిద్ధం కావాలని నిర్ణయించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రెండు నెలల ముందు నుంచి రాష్ట్రాల సరిహద్దు పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా ఎన్నికల నియమావళిలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను అందించే చర్యలు చేపట్టారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే సమాచారంతోనే అక్రమ మార్గాల ద్వారా వచ్చే మద్యం, నగదు ఇతర వాటిని అడ్డుకోవచ్చని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శనం చేసేందుకు మూడు అంచెల్లో అధికారులకు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించారు. మహారాష్ట్ర పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం వ్యవస్థను పరస్పర మార్పిడి చేసుకోవడంతోనే ఎన్నికలను సజావుగా ముగించే దిశగా కార్యచరణకు రంగం సిద్ధం చేసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికలలో ధనం, మద్యం పాత్ర విశేషంగా ఉంటుందని.. వాటిని అరికట్టడానికి ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండి విశేష కృషి చేయాలని సూచించారు. మావోయిస్టులను జిల్లాల్లోకి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చేస్తూ మావోయిస్టు యాక్షన్ టీంలను నిలువరించే బహుముఖ వ్యూహం రచించాలని పిలుపునిచ్చారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ప్రస్తుతం వినియోగిస్తున్నారని, వాటి ద్వారా ఎలాంటి సమస్యలనైనా క్షణాల్లోనే పరిష్కరించే దిశగా కింది స్థాయి సిబ్బంది కృషి చేయాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో నాందేడ్ అదనపు ఎస్పీ అభినాష్, నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ , ముథోల్ సీఐ మల్లేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు బాధ్యతగా పనిచేయాలి: డీపీవో


మాట్లాడుతున్న డీపీవో జయసుధ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు వారి విధుల పట్ల బాధ్యతయు తంగా పనిచేయాలని, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు.సోమవారం డిచ్‌పల్లిలోని మానవత సదన్ డివిజన్ లెవల్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అన్ని మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు వెంటనే పరిష్కరించేల చర్యలు తీసుకోవాలని డీపీవో సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ కుమార్, డివిజన్‌లోని తహసీల్దార్‌లు,ఎంపీడీవోలు,ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

చెరువులో ఇద్దరు ప్రాణ స్నేహితుల గల్లంతు

● కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో చెరువులో జారిపడి మృతి ● గణేష్ మృత దేహం లభ్యం
● అభిషేక్ మృత దేహం కోసం కొనసాగుతున్న గాలింపు


చెరువులో జాలర్లు వెతుకుతున్న దృశ్యం

బీర్కూర్, ఫిబ్రవరి 5 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చికుర్తి గణేష్ (16), వల్లు అభిషేక్ (16) అనే ఇద్దరు ప్రాణ స్నేహితులు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గ్రామ సమీపంలోని అంకూస్‌ఖాన్ చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో ఇరువురు స్నేహితులు గల్లంతయ్యారు. సాయంత్రం వరకు ఈ విషయం ఎవరికి తెలియరాలేదు. చెరువు కట్టపై బైక్, వారి చెప్పులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అలాగే ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బైక్ ను చెప్పులను పరిశీలించారు. బైక్ గణేష్‌దని గుర్తించారు. అనంతరం గణేష్, అభిషేక్‌ల ఆచూకీ కోసం చుట్టూ పక్కల గాలించారు. వారి ఆచూకి ఎంతకు లభించలేదు. దీంతో గణేష్, అభిషేక్‌ల కుటుంబ సభ్యులు తమ కుమారులు చెరువులో పడి ఉంటారని పోలీసులతో పేర్కొన్నారు. చెరువులో గాలించమని పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీసులు గజ ఈతగాళ్ళను రప్పించి రంగంలోకి దింపారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్ళు చెరువులో గాలించి గణేష్ మృత దేహన్ని వెలికి తీశారు. అభిషేక్ మృత దేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్ ఉదయాన్నే తన ద్విచక్ర వాహనం తీసుకుని అభిషేక్ వద్దకు వచ్చాడు. అభిషేక్ అప్పటికే స్కూల్‌కు వెళ్లేందుకు రెడీ అయ్యాడు. గణేష్ రావడంతో స్కూల్ బ్యాగ్ చర్చి వద్ద పెట్టి ఇద్దరూ వాహనంపై అంకూస్ ఖాన్ చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువు కట్టపై బైక్‌తో పాటు ఇరువురు చెప్పులు వదిలి పెట్టారు. సాయంత్రం వరకు బైక్ చెప్పులు అలాగే ఉండటంతో అటుగా వచ్చిన వారు ఏదో జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తంచేశారు. పోలీసులకు సమాచారం అందించారు. గణేష్, అభిషేక్‌లు కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయి మృతి చెంది ఉంటారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులు భావిస్తున్నారు.

● గణేష్, అభిషేక్‌లు ఇద్దరూ క్లాస్‌మేట్స్ చిన్నప్పటి నుంచి స్నేహంగా ఉండేవారు. ఇంటి పరిస్థితుల రీత్యా గణేష్ బీర్కూర్‌లో ఒక బైక్ మెకానిక్ వద్ద బైక్ మెకానిజం నేర్చుకుంటున్నాడు. అభిషేక్ బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. గణేష్ తల్లిదండ్రులు భారతి, విఠల్‌లు కూలీపనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గు రు సంతానం.ఇద్దరు కుమార్తెలు, ఒక కుమా రుడు గణేష్ ఉన్నారు. జ్యోతి, ధన్‌రాజ్‌లకు ఇద్ద రు సంతానం.ఒకకుమార్తె ఒక కుమారుడు అభిషేక్ ఉన్నాడు.వీరు గత కొన్నాళ్లుగా బతుకు తెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. అభిలాష్ ఇక్కడే నానమ్మ దగ్గర ఉంటూ పదవ తరగతి చదువుకుంటున్నాడు. గణేష్, అభిలాష్ లుమృతిచెందడంతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు గడ్డి వాములు దగ్ధం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన రామచంద్రనాయక్ అనే వ్యక్తికి చెందిన రెండు గడ్డి వాములు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కరెంట్ స్తంభం నుంచి విద్యుత్ మీటర్లకు సరఫరా అవుతున్న కరెంట్ తీగల నుంచి గాలికి నిప్పు రవ్వలు గడ్డివాములపై పడటంతో రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. గమనించిన గ్రామస్తులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అర్పినట్లు తెలిపారు. పశువుల గ్రాసం అయిన గడ్డి కాలిపోవడంతో పశువులకు మేత ఇబ్బంది అవుతుందని ప్రభుత్వం తనకు నష్ట పరిహారం అందించాలని బాధితులు కోరాడు.

ఎస్సారెస్పీ ప్రాజెక్టులో వ్యక్తి గల్లంతు

ముప్కాల్, ఫిబ్రవరి5: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రం ముప్కాల్ గ్రామానికి చెందిన అనికెష్ రమేష్(46) వ్యక్తి గల్లంతయ్యాడు. ముప్కాల్ ఎస్సై బాస్కరచారి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పోచంపాడ్ బ్యాక్ వాటర్‌లో రోజులాగే సాయంత్రం చేపల పట్టడానికి వెళ్ళిన రమేష్ వెళ్లాడు. చేపలు పట్టడానికి తెప్పపై నుంచి ప్రమాదశాత్తు నీటిలో పడిపోయాడు. నీటికి కొద్దిదూరంలో ఉన్న శ్రీనివాస్, గంగాధర్, మరికొంత మంది జాలర్లు అరుపులు, కేకలు వినిపించగా రమేష్ వద్దకు వెళ్ళే సరికి నీటిలో కనిపించకుండా పోయాడు. రమేష్ భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని, గజ ఈతగాళ్లతో నీటిలో గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. డ్యాంమధ్యలో లోతు ఎక్కువగా ఉండడంతో గజఈతగాళ్లు ఎంత వెతికినరమేష్‌ఆచూకీ లభించలేదనిఅన్నారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి మృతి

పిట్లం ఫిబ్రవరి 5: మండల కేంద్రానికి చెందిన రాములు(33) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని సోమవారం మృతి చెందాడని ఎస్ఐ విజయ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు పిట్లం గ్రామానికి చెందిన రాములు తన భార్య అంజవ్వ ఇంట్లో ఎటువంటి పనులు ఎంత చెప్పిన చేయడం లేదని, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో నుంచి ఉదయం బయటకు వెళ్లి ఈద్గా వద్ద గల చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడని తెలిపారు.మృతునికి ఇద్దరు కూతురులు, ఒక అబ్బాయి ఉన్నారు. మృతుని తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

రెంజల్,ఫిబ్రవరి5: రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతి(35)అనే మహిళ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతికి గత ఆరు నెలల నుండి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందిందని ఆయన అన్నారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

'ప్రజావాణి'కి 97 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు



పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి 97 వినతులు వచ్చాయి. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో జయసుధ తదితరులకు అందచేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతు సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి..

నగరంలోని సుబాష్‌నగర్ ప్రాంతంలోని నారాయణ పాఠశాల తప్పుడు సర్టిఫికెట్లను సమర్పించి 2023-24విద్యా సంవత్సరానికి ఓపెనింగ్ పర్మిషన్ తీసుకున్నారని ఫోర్జరీ పత్రాలతో అనుమతులు పొందిన నారాయణ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జ్వాల మాట్లాడుతూ.. నారాయణ కార్పొరేట్ పాఠశాలకు సంబంధించి ఎటువంటి అనుమతులకు సంబంధిత ప్రక్రియలు విద్యాశాఖకు వివిధ డిపార్ట్‌మెంట్ల నుంచి అనుమతులు పొందినట్లు లెటర్లు ఇచ్చినప్పటికి 2022-23లో నారాయణకు అనుమతులు ఉన్నట్లు, లీజ్ అగ్రిమెంట్లు రిజిస్ట్రేషన్ కాకముందే ఆ పాఠశాలకు అనుమతి ఇచ్చినట్లు సానిటరీ సర్టిఫికెట్ రావడం రిజిస్ట్రేషన్ డీడీ చూడకుండా శానిటరీ సర్టిఫికెట్ ఇవ్వడం సరికాదన్నారు. 2022లో లిబర్టీ స్కూల్‌కు ప్రస్తుతం నారాయణ స్కూల్ ఉన్న బిల్డింగ్‌లో పర్మిషన్ ఉండడం జరిగిందని, ఈ విషయం తెలియని విద్యాశాఖాధికారులు సంతకాలు పెట్టేసి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈవిషయంలో మరో సారి విచారణ జరిపి తక్షణమే ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



కబడ్డీలో ప్రథమస్థానంలో నిలిచిన తాళ్లరాంపూర్ జట్టు



వాలీబాల్‌లో ప్రథమస్థానంలో నిలిచిన కోరుట్ల జట్లు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి,
- ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మెండోర, ఫిబ్రవరి5: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గోపి, రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న బుట్టడి వినోద్ స్మారక కబడ్డీ, వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా కబడ్డీ ఫైనల్ పోటీలో తాళ్ళరాంపూర్, సుర్బిర్యాల్ జట్ల మధ్య జరగగా తాళ్లరాంపూర్ జట్టు విజయం సాధించింది. వాలీబాల్ ఫైనల్ పోటీలో కోరుట్ల, తడ్వాయి జట్ల మధ్య జరగగా తాళ్లరాంపూర్ జట్టు విజయం సాధించింది. గెలుపొంది కబడ్డీ తాళ్లరాంపూర్ జట్టుకు రూ.25వేలు, వాలీబాల్‌లో గెలుపొందిన కోరుట్ల జట్టుకు రూ.25వేల బహుమతులు, రెండో స్థానంలో నిలిచిన కబడ్డీ జట్టు సుర్బిర్యాల్‌కు రూ.15వేలు, వాలీబాల్ పోటీలో రెండో స్థానంలో నిలిచిన తడ్వాయి జట్టుకు రూ.15 బహుమతులను జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. క్రీడల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, ముత్యంరెడ్డి, వెల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అరుణ నవీన్‌గౌడ్, సొసైటీ ఛైర్మన్ మాచ్పర్ల రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ యువజన జిల్లా అధ్యక్షుడు వేణు, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, సురేందర్, శ్యామ్, ప్రేమ్, రమణ, పాల్గొన్నారు.

'అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 5: మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్‌డివిజన్ షీటీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు సైబర్‌క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగినులు, మహిళలు వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలని, క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, మధుపర్మిల పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలోని రాజారాంనగర్ కాలనీకి చెందిన తప్పిపోయిన బాలిక షేక్ మేహ్రను స్థానిక పోలీసులు పట్టుకొని అప్పగించారు. సోమవారం సాయంత్రం 5గంటల ఇంటి నుంచి ఆడుకుంటూ వెళ్ళిపోయిన షేక్ మేహ్రా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల గాలించి 100నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కాగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఆదేశాల మేరకు పోలీసుల బృందం గాలించగా మామిడిపల్లి చౌరస్తా వద్ద కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

'బంద్‌ను విజయవంతం చేయండి'

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి 5: భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో ఈనెల 16న కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.ముత్తెన్న తెలిపారు. సోమవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ కార్పోరేట్ మతతత్వ విధానాలను అవలంబిస్తుందని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి పదేళ్ళు పూర్తయిన రైతంగ కార్మిక ప్రజల సమస్యలను పరిష్కరించలేదని, శ్రమికుల నిజవేతనాలు 20శాతం తగ్గిపోయాయని అన్నారు.

భిక్షాటన చేసే మహిళ నుంచి బాలుడి అపహరణ

- మద్యం తాగించి బాలుడిని ఎత్తుకెళ్లిన నిందితులు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 5: పొట్టకూటి కోసం భిక్షాటన చేస్తూ జీవించే ఓ మహిళ వద్ద నుంచి బాలుడిని అపహరించిన ఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ కథనం ప్రకారం.. నిర్మల్ పట్టణానికి చెందిన ఓ యువతి తన కొడుకుతో కలిసి నిజామాబాద్ పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఎప్పటిమాదిరిగా తన కొడుకుతోపాటు నిజామాబాద్ కోర్టు చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు (ఒక మగ, ఒక ఆడ) వచ్చి ఆమెను మాటల్లో పెట్టారు. భోజనం పెట్టిస్తామని నమ్మబలికి ఆమెను కంఠేశ్వర్ బైపాస్ వద్దకు తీసుకెళ్లారు. సమీపంలోని కల్లుబట్టిలో ఫుల్లుగా కల్లు తాగించారు. రాత్రి వరకు ఆమెతో సన్నిహితంగా ఉండి రాత్రి 8.30కు ఆమె వద్ద ఉన్న సంవత్సరన్నర వయస్సున్న కొడుకు గణేష్‌ను తీసుకుని బైక్‌పై పరారయ్యారు. మద్యం మత్తు వదిలిన తర్వాత తన పక్కన కొడుకు లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించింది విలపించింది. దీంతో స్థానికులు రూరల్ పోలీసుకులకు సమాచారం అందించారు. సదరు మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. కంఠేశ్వర్ బైపాస్ సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా బైక్‌పై బాలుడిని తీసుకుని వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. నిందితుల ఫొటోలు, బైక్ నెంబర్ ఆధారంగా విచారణను ముమ్మరం చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. నిందితుల వివరాలు తెలిసిన వారు8713659849, 871265947నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో ఐదుగురి రిమాండ్

ఖిల్లా, ఫిబ్రవరి 5: నగరంలోని మాలపల్లికి చెందిన మినాహాజ్ అనే ఏడేళ్ల బాలుడిని జనవరి 30న కిడ్నాప్ చేసిన వారిలో ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. వీరిలో మాలపల్లికి చెందిన సోహెల్‌ఖాన్, ఆబెద్, శబాన, జరీన, చాంద్‌పాషాలను రిమాండ్ చేసినట్లు తెలిపారు. మరో మహిళ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. శబానను కస్టడీకి తీసుకొని విచారణ జరుపుతామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 5: నేటితరం విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగ్‌నాథ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ వార్షికోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థినులు చేపట్టిన వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ నూతన ఆలోచనలతో ఇన్నోవేటర్స్ హర్సిన్ బర్గ్, స్టీఫెన్ హేవ్‌కిన్స్, సి.వి.రామన్, మైక్రో మైండ్స్, న్యూటన్ టెక్నాలజీ, ఐడియా డెవలపర్స్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి అంశాలపై విద్యార్థులు వైజ్ఞానికతను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు చేయాలి

ఖిల్లా, ఫిబ్రవరి 5: పసుపు మద్దతు ధర రూ.18వేల నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్ డిమాండ్ చేశారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న మార్క్‌ఫెడ్ కార్యలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో కూరకపోతున్నారన్నారు. పసుపు పంట ఖరీదైందని అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి రేటు ఉన్నప్పటికి దుంపతెగుళ్ళ, మర్రాకు తెగుళ్ల వల్ల దిగుబడి 30శాతం తగ్గిపోయిందన్నారు. ఎకరానికి సుమారు లక్ష 50వేల వరకు ఖర్చుతవుతుందన్నారు. అందుకు తగ్గ రైతులకు ధరలు రాకపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పసుపు రైతులు ఆకుల నరేష్, వల్లపు వెంకటేశ్, కుంట నగేష్‌రెడ్డి, రాజేశ్వర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 5: విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడి దారులైన అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిరెడ్డి, సాయిలు, కృష్ణగౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ముస్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పండిత్ వినీత సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధర్మం గెలిచిందని, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కౌన్సిలర్‌లతో కలిసి అవిశ్వాసం పెట్టించాడని ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం పలువురు కౌన్సిలర్‌లు, అధికారులు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్‌ను పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్‌లు ఎస్‌ఆర్.సుజాత రమేష్, కొంతం మంజుల మురళీధర్, తలారి మీనచందు, లింగంపల్లి బాగ్యశివకృష్ణ, తాటి హన్మండ్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు రాకున్నా బాధ్యతలు తీసుకోవడం సరికాదు

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎలాంటి ఉత్తర్వులు రాకున్నా పండిత్ వినీత బాధ్యతలు తీసుకోవడం సరికాదని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అవిశ్వాస పరీక్ష రోజు ఎక్స్ అఫిషియో ఓటు నమోదు కాలేదని తెలిపిన అధికారులు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని ఆ రోజు సూచించారు. అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకోవడం సరికాదని వారు విమర్శించారు. చైర్‌పర్సన్ ఎన్నికకు తేదీని ఖరారు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్న, కౌన్సిలర్‌లు ఆకుల రాము, ఇట్టెడి నర్సారెడ్డి, బండారి ప్రసాద్, ఇంతియాజ్, అయ్యప్ప శీను, సుంకరి రంగన్న, అతిక్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 5: తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా ఏప్రిల్/మే 2024లో నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఈనెల 21వరకు సాధారణ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లిం చవచ్చని డీఈవో ఎన్‌వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25అదనపు రుసుముతో ఈనెల 27వరకు, రూ.50 అదనపు రుసుముతో మార్చి4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఇతర సందేహాలకు ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ తుల రవీందర్-8008403518 నంబరును సంప్రదించాలన్నారు.

దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5: 2023-24విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళ, శిశుసంక్షేమ దివ్యాంగుల శాఖ అధికారి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ కనీసం వైకల్యం 40 శాతం లేదా ఆపైన ఉండాలని, లక్షలోపు ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, అంగ వైకల్యం చూపే ఫొటోలు, సంబందిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం, స్టాంపుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కలెక్టర్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వాహనాలపై ఉన్న చలాన్లపై గడుపు పెంపు

ఖిల్లా, ఫిబ్రవరి 5: మోటారు వాహనాల ఈ చలాన్లపై ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవార్ తెలిపారు. ఫిబ్రవరి 15తర్వాత స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ వెల్లడించారు.

కూనేపల్లిలో క్యాన్సర్‌పై అవగాహన

రెంజల్, ఫిబ్రవరి 5: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కూనేపల్లి గ్రామంలో వైద్యాధికారిణి ప్రమోదిత ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అవయవానికి వేర్వేరు లక్షణాలలో మానకుండా పెరిగే పుండు కణతి ఆడవారిలో రొమ్ము గడ్డలు, గర్భాశయం ముఖద్వారం క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుట్కా తినడం వల్ల గొంతు క్యాన్సర్, నోటీ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వీటి పట్ల అప్రమత్తంగా ఉండి మానేయాలని సూచించారు. ఇవే కాకుండా బోన్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చినప్పుడు శరీరంలో బరువు తగ్గడం, నిరసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉంటుందని, అప్పుడప్పుడు జ్వరం వచ్చి తగ్గడం వంటి తదితర లక్షణాలు వచ్చినప్పుడు వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించి చికిత్సను ప్రారంభించినట్లయితే క్యాన్సర్ తగ్గే అవకాశం ఉంటుందన్నారు. క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలు సరైన సమయంలో వైద్యులను సంప్రదించాలని ఆమె అన్నారు. ఇందులో ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, ఏఎన్ఎం భాగ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

మోస్రా, ఫిబ్రవరి 5: గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం మోస్రా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ శ్రీకాంత్, ఉప తహసీల్దార్ సాయిలు, ఎంపీవో రఫీ, సర్పంచులు విమల లింగయ్య, నరేందర్ రెడ్డి, మేని బాబు, భూమయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానం మరొకరి ప్రాణాలు కాపాడుతుంది

- బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 5: రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం చేయడం చాలా గొప్పదని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని గంజ్ ఆర్టీసీ కాలనీలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఇంత మంచి వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. వైద్య విభాగంలో పని చేస్తూ కరోనా మహమ్మరీ కష్ట కాలంలో ఇంత మంది ప్రజలకు వైద్యం అందించిన ఆరోగ్య జ్యోతిని ఈ సందర్భంగా అభినందించారు. ఏడు సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం, వాటిని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు పంపడం, అవి మరొకరి ప్రాణాలను కాపాడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, సీఐ వీరయ్య, బోధన్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్ఎంవో అబ్దుల్ రహీం, బాన్సువాడ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌లతో డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీల్‌కుమార్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



డివిజన్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

బోధన్ రూరల్, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాలలో సమన్వయంతో పని చేయాలని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు డివిజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాలలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లోని వార్డులను పరిశీలించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని, ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు మరింత అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో గౌసుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మున్నీ నాయక్, ఎంపీడీవో పర్వన్న, తహసీల్దార్ గంగాధర్, మల్లయ్యలతో పాటు బోధన్ డివిజన్‌లోని ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

బోధన్ రూరల్ సీఐగా కోల నరేష్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 5: బోధన్ రూరల్ సీఐగా కోల నరేష్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ సర్కిల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న నరేష్ బదిలీపై బోధన్ సీఐగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ శ్రీనివాసరాజులు సీసీఆర్‌బీ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ కోల నరేష్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో అక్రమ ఇసుక, గుట్కా, గంజాయి రవాణాను అరికడతామని ఆయన అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ఆర్మూర్‌టౌన్ ఫిబ్రవరి 5: పట్టణంలోని మార్కెట్‌యార్డులో సోమవారం ఎస్‌హెచ్‌వో రవికుమార్ రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ద్వారా చాలా రక్షణ ఉంటుందని ఆయన సూచించారు. వాహనదారులు నియమాలను పాటించాలని, రోడ్డు అతిక్రమించి వాహనాలు నడపరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, ఎఎస్సై చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఏర్గట్ల విద్యార్థిని సత్తా

ఏర్గట్ల, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడవ తగరతి చదువుతున్న విద్యార్థిని ఎన్ శ్రీనిధి అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. విశాఖపట్టణంలో నిర్వహించిన ఏడవ అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఎన్ శ్రీనిధి కటాస్ స్పారింగ్ అండర్ 14 విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. విద్యార్థినికి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,400	రూ.59,400	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20,6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) (3.15,9.45)
స్క్రీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) (11.45)
: హనుమాన్ (తెలుగు) (3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 :అర్గిలీ(ఇంగ్లీష్)(11.00,7.45)
:గేమ్‌ఆన్(2.05)
: ధీర (5.05)
:అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.50)
స్క్రీన్-4 :కిస్మత్ (10.10,7.15)
: బూట్‌కట్‌బాలరాజు (1.00)
:హ్యాపీఎండింగ్ (4.05)
: ధీర (10.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : ధీర (10.45,7.20)
:గేమ్‌ఆన్(1.25)
:హ్యాపీఎండింగ్ (4.30)
:బూట్‌కట్‌బాలరాజు (10.20)
స్క్రీన్-3 : హనుమాన్ (1.30,4.30,7.30,10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కిస్మత్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్